క్లుప్తంగా

స్థల పొజిషన్ సర్టిఫికెట్ల అందజేత



గిరిజనులకు పొజిషన్ సర్టిఫికెట్లను అందజేస్తున్న తహసీల్దారు శ్రీదేవి

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలోని ఆలత్తూరు గ్రామపంచాయతీ పరిధిలోని పట్టాభి గిరిజన కాలనీకి చెందిన 20 మంది లబ్ధిదారులకు సోమవారం తహసీల్దారు శ్రీదేవి ఇంటి స్థలాలకు సంబంధించిన పొజిషన్ సర్టిఫికెట్లను అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గిరిజనులకు హౌసింగ్ పథకంలో ఇంటి నిర్మాణం కోసం పొజిషన్ సర్టిఫికెట్లను ఇవ్వడం జరిగిందన్నారు. ఈ సర్టిఫికెట్ హౌసింగ్ అధికారులకు అందజేస్తే పక్కా గృహం మంజూరు చేస్తారని తెలిపారు. తద్వారా వారికి ఇంటి స్థలంపై సర్వహక్కులు వస్తాయన్నారు. ఈ అవకాశాన్ని గిరిజనులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో వీఆర్‌ఓ భాస్కర్, తదితరులు పాల్గొన్నారు.

శాస్త్రోక్తంగా సంకట చతుర్దశి పూజలు



హోమం నిర్వహిస్తున్న వేదపండితులు

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయంలోని అంజి అంజి వినాయకస్వామివారికి సోమవారం శాస్త్రోక్తంగా సంకట చతుర్దశి పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా వేదపండితులు గణపతి హోమం జరిపించారు. అనంతరం స్వామివారికి అభిషేకం చేపట్టారు. విశేషంగా అలంకరించి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు.

జ్యుడీషియల్ విచారణకు డిమాండ్



ఆర్‌డీఓకు వినతిపత్రం అందిస్తున్న సీపీఐ నేతలు

శ్రీకాళహస్తి: జనసేన శ్రీకాళహస్తి నియోజకవర్గ మాజీ ఇన్‌చార్జి కోట వినుత కారు డ్రైవర్‌గా పనిచేసిన శ్రీనివాసులు అలియాస్ రాయుడు హత్యపై జ్యుడీషియల్ విచారణ చేపట్టాలని సీపీఐ నేతలు డిమాండ్ చేశారు. సోమవారం ఈ మేరకు ఆర్‌డీఓ భానుప్రకాష్‌రెడ్డికి వినతి పత్రం అందించారు. సీపీఐ ఏరియా కార్యదర్శి జనమాల గురవయ్య మాట్లాడుతూ రాయుడును జనసేన నేతలు ఎందుకు హత్యచేయాల్సివచ్చిందో ప్రజలకు తెలియాల్సిన అవసరముందన్నారు. కార్యక్రమంలో సీపీఐ నేతలు గోపి, శివకుమార్ పాల్గొన్నారు.

వెండి నాగపడగల బహూకరణ



నాగపడగలను అందిస్తున్న దాతలు

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయానికి విజయనగరం జిల్లా బొబ్బిలికి చెందిన లక్ష్మి దంపతులు సోమవారం 3.18కిలోల వెండి నాగపడగలను బహూకరించారు. ఈ మేరకు ఈఓ బాపిరెడ్డికి అందజేశారు. దాతలకు స్వామి అమ్మవార్ల దర్శన భాగ్యం కల్పించారు.



మంటలను ఆర్పుతున్న అగ్నిమాపక సిబ్బంది



పరిశ్రమలో కాలిపోయిన పరికరాలు



క్రోమో మెడికేర్ కంపెనీ ప్రధాన ద్వారం

భద్రత.. గాలిలో దీపమేనా?

గాజులమండ్యం పారిశ్రామికవాడ ప్రమాద రహితమేనా..? ఇందులోని పరిశ్రమలు భద్రతా ప్రమాణాలు పాటిస్తున్నాయా..? కార్మికుల ప్రాణాలకు భరోసా కల్పిస్తున్నాయా..? రక్షణ పరికరాలను అందుబాటులో ఉంచుతున్నాయా..? అధికారులు సక్రమంగా పర్యవేక్షిస్తున్నారా..? సోమవారం క్రోమో మెడికేర్ కంపెనీలో సంభవించిన అగ్నిప్రమాదం పలు ప్రశ్నలు రేకెత్తిస్తోంది. రియాక్టర్ పేలినప్పుడు సమీపంలోని ఫ్యాక్టరీ నుంచి అగ్నిప్రమాద పరికరాలను తీసుకురావడం పలు సందేహాలకు తావిస్తోంది. పారిశ్రామిక వాడలోని కంపెనీలు నిర్లక్ష్యం కారణంగా కార్మికుల భద్రత గాలిలో దీపంలా మారిందనే ఆరోపణ వినిపిస్తోంది.



కంపెనీలో అగ్ని ప్రమాదం అనంతర దృశ్యం

- గాజులమండ్యం పారిశ్రామిక వాడ పదిలమేనా..?
- పరిశ్రమలు భద్రతా నిబంధనలు పాటిస్తున్నాయా..?
- అధికారుల పర్యవేక్షణ అంతంత మాత్రమేనా..?

రేణిగుంట: గాజుల మండ్యం పారిశ్రామిక వాడలోని క్రోమో మెడికేర్ కంపెనీలో సోమవారం మధ్యాహ్నం ఒకటిన్నర గంటలకు రియాక్టర్ పేలడంతో అగ్నిప్రమాదం సంభవించింది. భోజన విరామ సమయం కావడంతో కేవలం ఇద్దరు కార్మికులు మాత్రమే ఘటనాస్థలంలో ఉన్నాయి. ఈ ప్రమాదంలో తెలంగాణకు చెందిన రవీంద్ర, గాజుల మండ్యానికి చెందిన వెంకటేష్ తీవ్రంగా గాయపడ్డారు. వీరిని మెరుగైన వైద్యం కోసం చెన్నైలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు.

కార్మికుల రక్షణ పట్టదా..?

కంపెనీలో పనిచేస్తున్న కార్మికులకు ఎటువంటి రక్షణ పరికరాలు ఇవ్వకపోవడంతో ప్రమాదంలో ఇద్దరు కార్మికులు తీవ్రంగా గాయపడి కొన ఊపిరితో కొట్టుమిట్టాడే దుస్థితి దాపురించింది. వారికి రక్షణ పరికరాలు ఇచ్చి ఉంటే స్వల్ప గాయాలతో బయపడేవారని పలువురు కార్మికులు మండిపడుతున్నారు. కష్టపడి పనిచేస్తున్నా మా రక్షణకు యాజమన్యాలకు పట్టదా అని ప్రశ్నిస్తున్నారు.

నిబంధనలు పాటిస్తున్నారా..?

కంపెనీలో భద్రతా నిబంధనలు పాటిస్తున్నారా అనేది ప్రశ్నార్థకంగా మారింది. ప్రమాదం జరిగిన వెంటనే సమీపంలోని మల్లాడి డ్రగ్స్ కంపెనీ నుంచి అగ్నిమాపక పరికరాలను రావాల్సి వచ్చిందని కార్మికులు వెల్లడిస్తున్నారు. వాటితో అగ్నిమాపక సిబ్బందికి సహాయంగా నిలిచి మంటలను అదుపులోకి తెచ్చామని వెల్లడిస్తున్నారు. అయితే ప్రమాదం సంభవించిన కంపెనీలో కనీస మాత్రం పరికరాలు లేకపోవడంపై అధికారులు దృష్టి సారించాలని కోరుతున్నారు.

పర్యవేక్షిస్తున్నారా..?

కంపెనీలను పర్యవేక్షించాల్సిన ఏపీఐఐసీ అధికారుల నిర్లక్ష్యం కారణంగానే ఇలాంటి ప్రమాదాలు జరుగుతున్నాయనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇలాంటి ప్రమాదాలు జరిగిన కొన్ని రోజులు మాత్రం హడావుడి చేసి తర్వాత కన్నెత్తి చూడడం లేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. అధికారులు సక్రమంగా పర్యవేక్షించి ఉంటే ఈ ప్రమాదంలో ఇద్దరికి ప్రాణాపాయం తప్పేదని కార్మికులు వాపోతున్నారు.

రాష్ట్రంలో మితిమీరిన రెడ్‌బుక్ పాలన



నూకతోటి రాజేష్

వరదయ్యపాళెం: రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వంలో రెడ్ బుక్ రాజ్యాంగం మితిమీరుతోందని, కనీసం మహిళలను వదలకుండా దాడులకు తెగబడడం వారి పరాకాష్టకు నిదర్శనమని సత్యవేడు నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త నూకతోటి రాజేష్ విమర్శించారు. ఉమ్మడి కృష్ణా జిల్లా జెడ్పీ చైర్మన్ ఉప్పాల హారికపై టీడీపీ గూండాలు దాడికి పాల్పడడం హేయమైన చర్య అన్నారు. మహిళలపై దాడి చేసే హీన సంస్కృతిని సైతం చంద్రబాబు ప్రోత్సహించడం దారుణమని, ఇటువంటి అమానుష దాడులను తీవ్రంగా ఖండిస్తున్నట్లు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇలాంటి దురహంకార చర్యలకు సమాధానం చెప్పే రోజులు దగ్గర్లోనే ఉన్నాయన్నారు. నీచ సంస్కృతిని పక్కన పెట్టి రాష్ట్ర ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేసేందుకు దృష్టి పెట్టాలని ఆయన సూచించారు.

తలనీలాల వేలం

నాగలాపురం: పిచ్చాటూరు మండలం రామగిరి సుబ్రమణ్య స్వామి ఆలయ ఆవరణలో సోమవారం బహిరంగ వేలం నిర్వహించారు. ఏడాది వ్యవధికి ఆలయంలో తలనీలాల సేకరణకు రెడ్ హిల్స్ చెందిన శరవణ పెరుమాల్ రూ.5.81 లక్షలు వేలం పాడి హక్కులు దక్కించుకున్నారు.

క్షయ నిర్మూలనే లక్ష్యం

రేణిగుంట: క్షయ వ్యాధి నిర్మూలనే లక్ష్యంగా పనిచేయాలని విప్పమని పట్టెడ సర్పంచ్ లక్ష్మీపతి రెడ్డి సూచించారు. సోమవారం విప్పమని పట్టెడ పంచాయతీ కార్యాలయంలో క్షయ నివారణపై అవగాహన సదస్సు నిర్వహించారు. డాక్టర్ సయ్యద్ జబ్బర్, కామరాజు, సుమ శ్రీ, యమునా, ఆశ వర్కర్ మోహిని పాల్గొన్నారు.

కూలీకి వెళ్లి తిరిగిరాని లోకాలకు..



జానీ(ఫైల్)



రాధ(ఫైల్)

శ్రీకాళహస్తి: మండలంలోని చుక్కలనిడిగల్లు ఎస్టీకాలనీకి చెందిన ఒకే కుటుంబానికి చెందిన రాధ, జాని, వెంటకరమణయ్య కూలీ పనులకు వెళ్లి, తిరిగిరాని లోకాలకు చేరుకున్నారు. అన్నమయ్య జిల్లా రెడ్డిపల్లి చెరువు కట్ట వద్ద లారీ బోల్తా పడిన ఘటనలో 9 మంది అక్కడికక్కడే మృతి చెందిన విషయం తెలిసిందే. రాజంపేట ఇసుకపల్లిలో మామిడికాయలు లోడింగ్‌కు వెళుతున్నామని మీరూ రావాలని శెట్టిగుంట ఎస్టీకాలనీకి చెందిన బంధువులు పిలవడంతో వెంకటరమణయ్య, తన భార్య రాధ, కుమారుడు జానీని వెంటబెట్టుకుని వెళ్లాడు. లోడింగ్ పూర్తయిన తరువాత తిరుగుప్రయాణంలో వస్తుండగా రెడ్డిపల్లి చెరువు వద్ద ఆ లారీ బోల్తా పడటంతో రాధ, జానీ అక్కడికక్కడే మృతి చెందారు. వెంకటరమణయ్య కడప రిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. దీంతో చుక్కలనిడదిగల్లు ఎస్టీకాలనీలో విషాదం నెలకొంది. వారికి మరో కుమార్తె ఉందని ఆమె ఓ ప్రైవేటు వస్త్ర దుకాణంలో పనిచేయడంతో వెళ్లలేదు. ఆ అమ్మాయికి చెప్పడానికి కూడా గ్రామస్తులు భయపడుతున్నారు.

బ్యాంకు రుణాల మంజూరుపై సమీక్ష

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలోని మహిళా సమాఖ్య సంఘాలకు ప్రణాళిక ప్రకారం మార్చి వరకు బ్యాంకు రుణాలకు అర్హత కలిగిన వారికి బ్యాంకు మేనేజర్ లాగిన్‌లో వెంటనే రుణాలను మంజూరు చేయించాలని జిల్లా అడిషనల్ ప్రాజెక్టు డైరెక్టర్ ప్రభావతి తెలిపారు. ఆమె సోమవారం బుచ్చినాయుడుకండ్రిగలోని వెలుగు కార్యాలయంలో సిబ్బంది రివ్యూ మీటింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వార్షిక రుణ, జీవనోపాధి ప్రణాళిక 93 శాతం పూర్తయిందని, మిగిలిన 7 శాతం ప్రణాళికను వారం రోజుల్లో పూర్తి చేయాలని తెలిపారు. అలాగే సభ్యులు వారి ఇంటి వద్ద స్థలం ఉన్నవారు కిచెన్ గార్డెన్స్ ఏర్పాటు చేసుకునేలా చూడాలన్నారు. మొబైల్ బుక్ కీపింగ్ 2.0కి డేటాతో అందరూ సిద్ధంగా ఉండాలని, సభ్యులు ఫొటోలు అప్‌లోడ్ పెండింగ్ ఉన్నవారు త్వరగా పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో బ్యాంకు లింకేజ్, ఫైనాన్స్ అధికారి వనజాక్షి, ఏపీఎం మునెయ్య, సీసీలు పాల్గొన్నారు.

గిరిజనులకు ఇంటి పట్టాలు ఇవ్వాలి



గిరిజనులతో కలసి ధర్నా చేస్తున్న సీపీఐ నేత చిన్నిరాజ్

సత్యవేడు: మండలంలోని కొత్తమారికుప్పం పంచాయతీ గిరిజన కాలనీ సమీపంలో ఖాళీగా ఉన్న స్థలాల్లో స్థానిక గిరిజనులకు ఇంటి స్థలాలు ఇవ్వాలని సీపీఐ నియోజకవర్గ ఇన్‌చార్జి చిన్నిరాజ్ కోరారు. సోమవారం తహసీల్దారు కార్యాలయం వద్ద గిరిజనులతో కలసి సీపీఐ నాయకులు ధర్నా చేపట్టారు. అనంతరం వారు తహసీల్దారు రాజశేఖర్‌కు వినతిపత్రం అందజేశారు. గిరిజన కాలనీలో 100 కుటుంబాలు నివసిస్తున్నట్లు తెలిపారు. గతంలో కొందరి గిరిజనులకు పట్టాలు పొందారన్నారు. ప్రస్తుతం పంచాయతీకి చెందిన కొందరు పెత్తందారులు అదే స్థలంలో పట్టాలు పొంది గిరిజనులు నిర్మించుకుంటున్న గుడిసెలను కూల దోశారన్నారు. రెవెన్యూ అధికారులు పరిశీలించి గిరిజనులకు న్యాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ నాయకులు చంద్ర, ధనుంజయులు, పాపయ్య, స్వప్న తదితరులు పాల్గొన్నారు.

శ్మశాన దారి కోసం నిరసన



నిరసన తెలుపుతున్న గ్రామస్తులు

రేణిగుంట: మండలంలోని గుత్తివారిపల్లె దళితవాడలో రెండు కుటుంబాలకు చెందిన వ్యక్తులు శ్మశానానికి వెళ్లే దారిని ఆక్రమించుకుని ఇల్లు నిర్మించుకున్నారని గ్రామస్తులు ఆరోపించారు. సోమవారం ఈ మేరకు నిరసన తెలిపారు. ఈ ఆక్రమణలను తొలగించాలని గ్రామసభ, పంచాయతీలో తీర్మానాలు చేసినా ప్రయోజనం లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఆక్రమణదారులు రైల్వే ఉద్యోగులు కావడంతో పోలీసులను గుప్పిట్లో పెట్టుకున్నారని, వారిని ఎదిరించిన పలువురు యువకులపై అక్రమ కేసులు నమోదు చేయించారని వాపోయారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి కబ్జాలను తొలగించాలని కోరారు.

వివాహిత ఆత్మహత్య

రేణిగుంట: మండలంలోని మామండూరులో కాపురం ఉంటున్న సలియా (25) ఇంట్లో ఎవరు లేని సమయంలో ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు స్థానికులు తెలిపారు. స్థానికుల కథనం మేరకు.. మామండూరు గ్రామానికి చెందిన బబ్బులు శ్రీకాళహస్తికి చెందిన సలియాను వివాహం చేసుకుని మామండూరులో కాపురం ఉంటున్నారు. వారికి కొడుకు, కుమార్తె ఉన్నారు. కుటుంబ ఆర్థిక ఇబ్బందులతో భర్త బబ్బులు కువైట్‌కు వెళ్లి రెండు సంవత్సరాలు ఉండి, గత నెలలో తిరిగి వచ్చాడు. మళ్లీ తిరిగి రెండు రోజుల క్రితం కువైట్‌కు వెళ్లాడు. అత్తా ఇద్దరు పిల్లలతో ఉంటున్న సలియా సోమవారం మధ్యాహ్నం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరివేసుకుంది. స్థానికులు గుర్తించి కరకంబాడి సమీపంలోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. అప్పటికే మృతి చెందినట్లు డాక్టర్లు నిర్ధారించారు. విషయం తెలుసుకున్న భర్త కువైట్ నుంచి తిరుగు ప్రయాణం అయినట్లు గ్రామస్తులు తెలుపుతున్నారు. ఈ ఘటనపై ఇప్పటివరకు ఎటువంటి ఫిర్యాదు అందలేదని అర్బన్ పోలీసులు తెలిపారు.

భూ పట్టాల పంపిణీకి డిమాండ్



ఎస్టీలతో మాట్లాడుతున్న నేతలు

శ్రీకాళహస్తి: మండలంలోని ఎల్లంపల్లె ఎస్టీ కాలనీ వాసులకు 23 ఏళ్ల క్రితం మంజూరు చేసిన భూములకు సంబంధించి పట్టాలు అందించాలని సీపీఐ(ఎంఎల్) న్యూ డెమోక్రసీ జిల్లా కార్యదర్శి రాయపనేని హరికృష్ణ డిమాండ్ చేశారు.సోమవారం ఎల్లంపల్లె యానాదుల కాలనీవాసులతోన్యూడెమోక్రసీ నేతలు సమావేశమయ్యారు. హరికృష్ణ మాట్లాడుతూ ప్రభుత్వం తక్షణం స్పందించి ఎస్టీల సాగు భూములకు పట్టాల మంజూరు చేయాలని, లేకుంటే పోరాటాలకు దిగుతామని స్పష్టం చేశారు. అధికారుల నిర్లక్ష్యం కారణంగా యానాదుల భూములు కబ్జాకు గురయ్యే పరిస్థితి ఏర్పడుతోందని చెప్పారు. రైతుకూలీ సంఘం జిల్లా గౌరవ అధ్యక్షుడు పాటూరు వెంకటరత్నం మాట్లాడుతూ ఎస్టీలంటే చిన్నచూపు తగదన్నారు. అఖిల భారత రైతు కూలీ సంఘం జిల్లా అధ్యక్షులు రామిశెట్టి వెంకయ్య మాట్లాడుతూ ఎస్టీల భూములకు పట్టాలు ఇచ్చేంతవరకు వారికి అండగా ఉంటామని తెలిపారు. నేతలు అరుణ, జాకీర్ పాల్గొన్నారు.

ఈ-కేవైసీ చేయించుకోండి



వినతిపత్రాలను పరిశీలిస్తున్న తహసీల్దారు

బుచ్చినాయుడుకండ్రిగ: అన్నదాత సుఖీభవ–పీఎం కిసాన్ పథకం లబ్ధి కోసం రైతులంతా తప్పనిసరిగా సమీపంలోని ఆర్‌ఎస్‌కే, ఈ సేవ కేంద్రాల్లో ఈ-కేవైసీ చేయించుకోవాలని తహసీల్దారు శ్రీదేవి తెలిపారు. సోమవారం తహసీల్దారు కార్యాలయంలో ప్రజాసమస్యల పరిష్కర వేదిక కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆధార్ సక్రమంగా లేనివారు 529 మంది ఉన్నారని, వీరంతా ఆధార్ సరిచేసుకోవాలని, చనిపోయిన వారు 579 మంది ఉన్నారని, వారి వారసులు సంబంధించిన పత్రాలు సమర్పించి వారి పేరును నమోదు చేసుకోవాలని సూచించారు. అదేవిధంగా బయట ప్రాంతాలకు చెందిన వారు 171 మంది రైతులున్నారని, వీరు కూడా ఈకేవైసీ చేసుకోవాలని తెలిపారు. వీఆర్‌ఓలు, గ్రామ కార్యదర్శులు వీరి ఆధార్‌ను సరిచేసి, ఈకేవైసీ చేయించాలన్నారు. వారంలోపు నమోదు చేయించుకోకుంటే అన్నదాత సుఖీభవ పథకం రాదని తెలిపారు. ఎంపీడీఓ వెంకటరత్నమ్మ, ఏపీఎం మునెయ్య పాల్గొన్నారు.

పోలీసులకు వైద్య శిబిరం



జ్యోతి ప్రజ్వలనలో ఎస్పీ హర్షవర్ధన్‌రాజు, డాక్టర్ రమాదేవి తదితరులు

రేణిగుంట: కరకంబాడి సమీపంలోని అమరరాజా కంపెనీ ఆడిటోరియంలో సోమవారం అమర హాస్పిటల్, కాంటినెంటల్ కాఫీ లిమిటెడ్,అ మర రాజా గ్రూప్స్ ఆధ్వర్యంలో పోలీసులకు ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఎస్పీ హర్షవర్ధన్‌రాజు, అమర హాస్పిటల్ ఎండీ డాక్టర్ రమాదేవి జ్యోతి ప్రజ్వలన చేసి శిబిరం ప్రారంభించారు. ఎస్పీ మాట్లాడుతూ మూడు రోజులపాటు వైద్య శిబిరం కొనసాగుతుందని తెలిపారు. మెడికల్ క్యాంపు నిర్వహణకు కృషిచేసిన రేణిగుంట డివిజన్ పోలీస్ అధికారులను అభినందించారు. డాక్టర్ రమాదేవి మాట్లాడుతూ మనం ప్రశాంతంగా జీవనం సాగిస్తున్నామంటే పోలీసులే ప్రధాన కారణమన్నారు. పోలీసుల కోసం మెడికల్ క్యాంపు ఏర్పాటు చేయడం సంతోషంగా ఉందని వెల్లడించారు. అదనపు ఎస్పీ రవి మనోహరాచారి, అదనపు ఎస్పీ ఆర్మ్‌డ్ రిజర్వు చంద్రశేఖర్, డీఎస్పీ శ్రీనివాస రావు, సీఈఓ భాగ్యలక్ష్మి, ,రేణిగుంట సీఐలు జయచంద్ర, మంజునాథ రెడ్డి, ఎస్ఐ అరుణ్ కుమార్ రెడ్డి, ఆర్ఐలు రమణారెడ్డి, రమణ పాల్గొన్నారు.

వేరుశనగ వెలవెల!



వేరుశనగ పంట

వేరుశనగ సాగు చేసిన రైతుల పరిస్థితి దయనీయంగా మారింది. వరుణుడు కరుణించకపోవడంతో దిగుబడి తగ్గిపోయింది. గిట్టుబాటు ధర లేకపోవడంతో పెట్టుబడి కూడా దక్కని దుస్థితి దాపురించింది. కొనేవారు ముందుకు రాకపోవడంతో పొలంలోనే పంట కుప్పలుగా మిగిలిపోయింది. చేసిన అప్పులు కళ్లెదుట కనిపిస్తుండడంతో తీర్చేమార్గం లేక అన్నదాత కంట కన్నీరు కారుతోంది. ప్రభుత్వం పట్టించుకోకపోవడంతో వ్యవసాయం పూర్తిగా కుదేలైంది. అధికారుల అలసత్వం కారణంగా రైతాంగం దిక్కుతోచక కొట్టుమిట్టాడుతోంది.

- గిట్టుబాటు ధర లేదు
- కొనేవారు కనిపించడం లేదు
- పెట్టుబడి కూడా రాని పరిస్థితి
- అప్పులతో అన్నదాతల దుస్థితి



వేరుశనగను తీస్తున్న రైతులు

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలో ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి రైతులు సుమారు 1500 ఎకరాల్లో వేరుశనగ సాగు చేపట్టారు. వర్షాలు లేకపోయినప్పటికీ బావులు, బోర్ల కింద కే–6 రకం పంటను అత్యధికంగా సాగు చేశారు. విత్తు వేసినప్పటి నుంచి ఆశించిన స్థాయిలో వరుణుడు కరుణించకపోవడంతోపాటు భానుడి తీవ్రతకు భూమిలోని వేరుశనగ కాయలు సక్రమంగా ఊరలేదు. దీనికితోడు తెగుళ్లు వెంటాడడంతో పంట పూర్తిగా దెబ్బతింది. ఎకరాకు 50 బస్తాల దిగుబడి రావాల్సి ఉండగా, కేవలం 15 నుంచి 20 బస్తాలు మాత్రమే వచ్చాయి. అలాగే గత రబీసీజన్‌లో 40 కేజీల వేరుశనగ కాయల బస్తా ధర రూ.2,800 పలకగా, ప్రస్తుతం కేవలం రూ.2,300 మాత్రమే ఉంది. దీంతో బస్తాకు రూ.500 వరకు రైతులు నష్టపోవాల్సి వస్తోంది. ఎకరాలో వేరుశనగ సాగుకు దాదాపు రూ.70వేలు ఖర్చవుతోందని, ఇప్పుడు 20 బస్తాలను అమ్మితే కేవలం రూ.56వేలు మాత్రమే వస్తోందని అన్నదాతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈక్రమంలో ఎకరాలకు రూ.14వేల వరకు నష్టపోతున్నామని వాపోతున్నారు. ధర వచ్చినప్పుడు అమ్ముకుందామనుకుంటే, కాయలను నిల్వ చేసుకునేందుకు గోదాములు కూడా లేవని ఆందోళన చెందుతున్నారు. పంట సాగుకు చేసిన అప్పులు ఎలా తీర్చుకోవాలో తెలియడం లేదని కంట తడి పెట్టుకుంటున్నారు.

కొనుగోలు కేంద్రాల ఊసే లేదు

కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత వ్యవసాయంపై శీతకన్ను వేసింది. రైతులకు చేయూతనందించడంలో పూర్తిగా నిర్లక్ష్యం వహిస్తోంది. గిట్టుబాటు ధర లేక కుమిలిపోతున్న అన్నదాతలను ఆదుకోకుండా మీనమేషాలు లెక్కిస్తోంది. అందులో భాగంగానే కొనుగోలు కేంద్రాల ఏర్పాటును విస్మరించింది. వేరుశనగ పంటను ప్రభుత్వం కొనుగోలు చేయాలని పలుమార్లు మొరపెట్టుకున్నప్పటికీ అధికారులు స్పందించడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆరుతడి పంటలను సాగు చేయాలంటూ గ్రామాల్లో పర్యటించిన వ్యవసాయశాఖ అధికారులు ఇప్పుడు ముఖం చాటేస్తున్నారని మండిపడుతున్నారు. కాయలను కొనేందుకు వ్యాపారులు ముందుకు రాకపోవడంతో పొలంలోనే ఎండుతున్నాయని వాపోతున్నారు. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు స్పందించి వేరుశనగ కొనుగోలుకు చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

దిగుబడి తగ్గింది

వాతావరణంలో మార్పుల కారణంగానే మండలంలో వేరుశెనగ పంట దిగుబడి తగ్గింది. ఆరు నెలలుగా వర్షాలు సక్రమంగా కురవలేదు. ఎండ వేడిమిని తట్టుకోలేక పంట దెబ్బతింది. రైతులు వస్తే మిల్లర్లతో మాట్లాడి గిట్టుబాటు ధరకు అమ్మిస్తాం. మార్కెట్ యార్డు అధికారులతో మాట్లాడి వేరుశనగ కాయలను నిల్వ చేయించేందుకు కృషి చేస్తాం.

– షణ్ముగం, వ్యవసాయశాఖ అధికారి



వేరుశనగ కాయలను ఆరబోస్తున్న రైతులు



పొలంలోనే కుప్పలుగా వేరుశనగ కాయలు

15న ఆడికృత్తిక ఉత్సవాలకు అంకురార్పణ

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయానికి అనుబంధంగా విజ్ఞానగిరిపై వెలసిన శ్రీవల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యస్వామికి ఈ నెల 20వ తేదీన ఆడికృత్తిక మహోత్సవం నిర్వహించనున్నట్లు ఈఓ బాపిరెడ్డి తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ 15 నుంచి 25వ తేదీ వరకు ఉత్సవాలు జరుగుతాయన్నారు. అందులో భాగంగా 15న అంకురార్పణ, 16న శ్రీవల్లీ దేవసేన సమేత చెంగల్వరాయస్వామి గర్భాలయంలో ధ్వజారోహణం, అంబారీఉత్సవం, 17న రెండో తిరునాళ్ల, సూర్యప్రభ వాహనం, రాత్రి భూత వాహనం, 18న మూడో తిరునాళ్ల, ఉదయం హంసవాహనం, రాత్రి రావణాసుర వాహనం. 19న నాలుగో తిరునాళ్ల, ఉదయం యాళి వాహనం, శేషవాహనం, 20న ఆడికృత్తిక, ఉదయం ఇంద్రవిమానం, రాత్రి మయూర వాహనం, 21న ఆరో తిరునాళ్ల, ఉదయం ఇంద్ర విమాన రథ అలంకరణ, రాత్రి నారద పుష్కరణిలో తెప్పోత్సవం, 22న ఏడో తిరునాళ్ల, ఉదయం చిలుక వాహనం, రాత్రి గజవాహనం, విజ్ఞానగిరి మండపం వద్ద శ్రీవల్లీ దేవసేన సమేత చెంగల్వరాయస్వామివారి కల్యాణోత్సవం, 23న చప్పరం, పార్వేట ఉత్సవం, 24న ఉదయం కేడిగ వాహనం, వసంతోత్సవం, ధ్వజావరోహణం, రాత్రి గ్రామోత్సవం. 25న రాత్రి 8గంటలకు పల్లకీసేవ నిర్వహించనున్నట్లు ఈఓ వివరించారు.